క్లుప్తంగా

బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై గంగన్న

దహెగాం: బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం నేరమని పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని ఆపరేషన్ ముస్కాన్ ఎస్సై గంగన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. 14 సంవత్సరాల లోపు ఉన్న వారిని పనిలో పెట్టుకోవద్దన్నారు. బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని పేర్కొన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు సహకరించాలని తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



తులసీరాం



రోహిత్

దహెగాం: మండల టీఎస్‌యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, జిల్లా కార్యదర్శి చాపిడి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా తులసీరాం, ప్రధాన కార్యదర్శిగా రోహిత్‌లను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అంజయ్య, ఉ పాధ్యక్షురాలిగా రిజ్వాన, కోశాధికారిగా లక్ష్మణ్, కార్యదర్శులుగా శివ, భారతి, మధునశ్రీ, ఆడిట్‌కమిటీ కన్వీనర్‌గా గోపి, కో కన్వీనర్‌గా లలిత, సోషల్ మీడియా కమిటీ కన్వీనర్‌గా సాయి, కో కన్వీనర్‌గా సంతోష్‌లను ఎన్నుకున్నారు.

పాఠశాలలో మరుగుదొడ్డి నిర్మాణం



విద్యార్థులతో నివాస్‌గౌడ్

దహెగాం: మండలంలోని దుబ్బగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నివాస్‌గౌడ్ అనే వ్యక్తి తండ్రి మొండయ్య జ్ఞాపకార్థం సొంత ఖర్చులతో మరుగుదొడ్డి నిర్మించారు. మరుగుదొడ్డి నిర్మాణం శనివారం పూర్తయ్యింది. విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్డి నిర్మించడంతో విద్యార్థులతో పాటు సిబ్బంది ఆయనను అభినందించారు. ప్రధానోపాధ్యాయురాలు సృజన, బీబ్రా ప్రధానోపాధ్యాయుడు కంబాల జయేందర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో పీటీఎం సమావేశాలు

కెరమెరి: మండలంలోని అన్ని యాజమాన్యాల కింద పని చేస్తున్న పాఠశాలల్లో శనివారం పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. బాలికా దినోత్సవం గురించి ఉపాధ్యాయులు పోషకులకు వివరించారు. . విద్యార్థులకు చేస్తున్న బోధన తీరును వివరించారు. ప్రతి నెలలో జరిగే సమావేశాలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. గోయగాం, కెరమెరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆడే ప్రకాశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

నాలుగేళ్ల తర్వాత పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలను ఈ నెల 29న నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఎన్నికల ప్రకటన (నోటీసును) ప్రధానోపాధ్యాయులు అందజేశారు. ఎన్నికల నిర్వహణ, వీటి ఆవశ్యకతపై వివరించారు.

నేటి నుంచి భజన కార్యక్రమం

ఆసిఫాబాద్‌అర్బన్: అయోధ్యలో ఈనెల 22వ తేదీన బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో నేటి నుంచి రెండు రోజులపాటు రాత్రి 7 గంటల నుంచి ప్రత్యేక భజనా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వైశ్య ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గుండా ప్రమోద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో అర్చకులు ముదిగొండ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నుంచి కాగజ్‌నగర్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శనివారం టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. కాగజ్‌నగర్ మండలంలోని వంజీరి గ్రామం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నుంచి అవనిగట్టి సాంబమూర్తి ఆటోట్రాలీలో నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఈమేరకు కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

‘తపాలా’లో వసూళ్ల పర్వం!

- పోస్టాఫీస్ ఖాతాల్లో పత్తి రైతుల నగదు జమ
- విత్‌డ్రా లిమిట్ రోజుకు రూ.10 వేలు మాత్రమే
- డబ్బులు తీసుకునేందుకు కార్యాలయం చుట్టూ చక్కర్లు
- బ్యాంకులకు నగదు బదిలీకి సిబ్బంది చేతివాటం



ఆసిఫాబాద్‌లోని తపాలా కార్యాలయం వద్ద రైతులు

ఆసిఫాబాద్‌రూరల్: ఆరుగాలం కష్టించి పండించిన పంటలను విక్రయించిన తర్వాత కూడా జిల్లా రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఒకవైపు పత్తికి ధర తగ్గడంతో ఆందోళన చెందుతున్న రైతులు, విక్రయించిన పంటకు సంబంధించిన డబ్బులు తపాలా ఖాతాల్లో జమకావడంతో అవస్థలు పడుతున్నారు. రోజుకు రూ.10 వేలకు మించి డబ్బులు తీసుకునే వీలు లేకపోవడంతో రోజులపాటు తపాలా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తపాలా ఖాతాల నుంచి బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేసేందుకు తపాలా సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొన్ని ఖాతాల్లో నగదు జమ కాక..

సీసీఐకి పత్తిని విక్రయించిన రైతులకు జిల్లాకేంద్రంలోని తపాలా కార్యాలయంలో ఖాతాలు ఉన్నాయి. దీంతో విక్రయించిన పత్తికి సంబంధించిన డబ్బులు నేరుగా తపాలా ఖాతాల్లో జమవుతున్నాయి. తపాలా ఖాతాల నుంచి రోజుకు రూ.10 వేలకు మించి తీసుకునే వీలులేకపోవడం.. చాలా మంది రైతులకు నెలల తరబడి డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడంతో రైతులు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. సీసీఐ నుంచి రూ.2 లక్షల కన్నా ఎక్కువ నగదు రావాల్సి ఉంటే ఖాతాల్లో జమ కావడం లేదు. కొన్ని ఖాతాలకు రూ.లక్ష వరకే పరిమితి ఉండడంతో అంతకంటే ఎక్కువ నగదు సంబంధిత రైతుల ఖాతాల్లో జమ కాని పరిస్థితి ఉంది. దీంతో ఇతర బ్యాంకులకు తమ ఖాతాలు మార్చాలని రైతులు విన్నవిస్తున్నారు. అయితే బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేయడానికి రూ.1000 నుంచి రూ. 2000ల వరకు తపాలా శాఖ సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

తగ్గిన ధర..

పత్తి పంటకు సరైన మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 10.44 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, 80 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ సంవత్సరం సీసీఐ మద్దతు ధర ఈనెల 16 వరకు క్వింటాల్‌కు రూ.7020లుగా ఉంది. ప్రస్తుతం రూ.6900 మాత్రమే ధర పలుకుతోంది. ప్రైవేట్ వ్యాపారులు క్వింటాల్‌కు రూ.6400 నుంచి రూ. 6500లకు పత్తి కొనుగోలు చేస్తున్నారు. సీసీఐకి పత్తి విక్రయించాలంటే ఆధార్‌కు బ్యాంకు లింక్, పట్టా పాసు పుస్తకం తప్పనిసరి కావడంతో కౌలు రైతుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

తపాలా ఖాతా నుంచి బ్యాంకు ఖాతాకు నగదు బదిలీ చేసేందుకు సిబ్బంది డబ్బులు తీసుకోవద్దు. ఇప్పటివరకు ఈ విషయం నా దృష్టికి రాలేదు. డబ్బులు ఇచ్చిన రైతులు ఫిర్యాదు చేస్తే తీసుకున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసకుంటాం.

– రాహుల్, ఆసిఫాబాద్ తపాలా కార్యాలయం పీఏ

మూడుసార్లు లింక్ చేసినా వస్తలేవు



డిసెంబర్ 19న పత్తి డబ్బులు తపాలా ఖాతాలో జమయ్యాయి. బ్యాంకు ఖాతాకు నగదు బదిలీ కావాలంటే ఆధార్ లింక్ చేయాలన్నారు. ఇప్పటికి మూడుసార్లు లింక్ చేసినా బ్యాంకు అకౌంట్‌లో జమ కాలేదు. నాకు మొత్తం రూ. 8 లక్షలు రావాలి.

– లేడుగురే చందు, ఖైరి, కెరమెరి

డబ్బులు ఇస్తేనే పని



తపాలా ఖాతాల్లో పత్తి డబ్బులు జమయ్యాయి. బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని తపాలా కార్యాలయానికి వెళ్తే రూ. 1500 ఇవ్వాలన్నారు. నా దగ్గర లేక రూ.700 ఇచ్చాను. దీంతో నా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేశారు. ఇలా చాలా మంది దగ్గర తీసుకుంటున్నారు.

– లక్ష్మణ్, మోతుగూడ

రూ.1500 తీసుకున్నారు..



సీసీఐకి పత్తి విక్రయించినా డబ్బులు నా బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. తపాలా ఖాతాలో జమయ్యాయి. బ్యాంకు ఖాతాలో జమ చేయాలని అడిగితే రూ. 1500 డిమాండ్ చేశారు. డబ్బులు తీసుకొని బ్యాంకు ఖాతాలో జమ చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రావుజీ, మోతుగూడ

నెల రోజులవుతుంది..



సీసీఐకి పత్తి విక్రయించి నెల రోజులు అవుతున్నా ఇప్పటివరకు నా ఖాతాలో డబ్బులు జమ కాలేదు. బ్యాంకు, తపాలా కార్యాలయంలో ఎక్కడ అడిగినా ఇంకా జమ కాలేదు అంటున్నారు. అధికారులు చొరవ తీసుకొని సకాలంలో డబ్బులు పడేలా చూడాలి.

– సాంబయ్య, అప్పపల్లి

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆలయ శుద్ధి



శివాలయాన్ని శుద్ధి చేస్తున్న హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని పురాతన ఈజ్‌గాం శివమల్లన్న ఆలయాన్ని శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆధ్వర్యంలో శుద్ధి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 22న అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నేపథ్యంలో ఆలయాల శుద్ధి కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు కొంగ సత్యనారాయణ, రస్‌వీర్ బిశ్వాస్, బికాస్ ఘరామి, పుల్ల అశోక్, దోతుల శ్రీనివాస్, సమీర్‌గుప్తా, సాంబయ్య, తిరుపతి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో శ్రమదానం

రెబ్బెన: అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామ మందిరంలో ఈనెల 22న శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని గోలేటి టౌన్‌షిప్‌లో గల శ్రీ కోదండ రామాలయంలో ఆదివారం విద్యా భారతి విద్యా సంస్థల సిబ్బంది, విద్యార్థులతో కలిసి శ్రమదానం ఏర్పాటు చేస్తున్నట్లు విద్యాభారతి విద్యాసంస్థల డైరెక్టర్ సురభి శరత్ తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు కోదండ రామాలయంలో చేపట్టనున్న శ్రమదాన కార్యక్రమంలో గోలేటి టౌన్‌షిప్‌లోని విద్యార్థుల తల్లిదండ్రులు, భక్తులు, పుర ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఆలయ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని కోరారు.

చేతి వృత్తులకు చేయూతనిస్తాం



శిక్షణ తీసుకుంటున్న వారితో బాలాజీ

దహెగాం: చేతి వృత్తులు చేసుకునే వారికి చేయూతనిస్తామని మిధాని కంపెనీ మేనేజర్ డాక్టర్ బాలాజీ అన్నారు. మండల కేంద్రంలో డీఆర్‌డీవో, మిధాని కంపెనీ ఆధ్వర్యంలో మేదరి కులవృత్తుల వారికి అందిస్తున్న శిక్షణ శిబిరాన్ని శనివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మేదరి కుల వృత్తులు వెదురుతో వివిధ రకాల వస్తువులు తయారు చేయడానికి తమ కంపెనీ సహకరిస్తుందన్నారు. శిక్షణలో 50 మందికి ఉచితంగా వెదురుతో తయారు చేసే వస్తువులపై నెల రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మిధాని అసిస్టెంట్ మేనేజర్ అమల్, జిల్లా టూరిజం అధికారి రామక్రిష్ణ, మేదరి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాకాల శ్రీనివాస్, కోశాధికారి దీకొండ సత్యనారాయణ, నాయకులు బూరం పోశన్న, వెంకటేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో సీఎస్‌సీ హెల్త్ కేర్ సహకారంతో 218 మందికి ఉచిత రక్తపరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ఉబెద్ బిన్ యాహియా మాట్లాడుతూ ఒకసారి తీసుకున్న రక్త నమూనాతో రూ. 20వేలు విలువ చేసే 134 రకాల పరీక్షలు చేసినట్లు వివరించారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్, మైక్రో కేబినెట్ సభ్యులు లయన్ పీచు వెంకటరమణారెడ్డి, సెక్రటరీ శంకర్, కోశాధికారి సీహెచ్ సంజయ్‌కుమార్, జోన్ చైర్మన్ కోట వెంకన్న, జిల్లా చైర్‌పర్సన్ ఇరుకుల అంజనేయులు, రావుల వినాయక్‌రావ్, మమతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అభివృద్ధికి పటిష్ట ప్రణాళిక



సమస్యలు తెలుసుకుంటున్న డీపీవో



మాట్లాడుతున్న ఈవో కృష్ణమూర్తి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ గ్రామపంచాయతీ అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి అహ్మద్ ఓమర్ హుస్సేన్ అన్నారు. పంచాయతీ ఆవరణలో 2024–25కు సంబంధించి అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో భాగంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్ హాజరు కాగా, డీపీవో అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు కాలనీల వాసులు తమ సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ సదాశివ్, భగీరథ డీఈ మదిన్, పంచాయతీ ఈవో వంశీకృష్ణ, సెక్రటరీ రవి, సిబ్బంది సంతోష్, నాగేందర్, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సిర్పూర్(టి) ఈవో కృష్ణమూర్తి అన్నారు. శనివారం సిర్పూర్(టి) మేజరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచ్ తోట మహేశ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 –25 సంవత్సరానికి గాను గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తోట మహేశ్, వార్డు సభ్యుడు ఇఫాత్‌హుస్సేన్ తదితరులు ఉన్నారు.

బాబాసాగర్‌లో ఎడ్లబండ్ల పందేలు



పందేలు ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ గ్రామంలో శనివారం ఎడ్లబండ్ల పందేలు నిర్వహించారు. బీజేపీ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో తాలూకా స్థాయిలో పోటీలు నిర్వహించారు. పోటీలను గ్రామ సర్పంచ్ కత్తర్ల సుశీల, బీజేపీ జిల్లా కార్యదర్శి దోని శ్రీశైలం, మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు ప్రారంభించారు. 50 మంది పోటీదారులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలలో మొదటి స్థానంలో చింతలమానెపల్లికి చెందిన వెంకటేష్ నిలవగా, రెండో స్థానంలో భీమారం గ్రామానికి చెందిన సుమిత్ యాదవ్ నిలిచారు. విజేతలకు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వంకులంలో అక్షింతల పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

రెబ్బెన: మండలంలోని వంకులం గ్రామంలో శనివారం అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన శ్రీ రాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాములోరి అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ పాలె ఓమాజీ, గ్రామస్తులు మనోహర్, తులసీరాం, బోర్కుటే తులసీరాం, విజయ్, బుచ్చయ్య, జలపతి, సంతోష్, బాలాజీ, బిజ్జు, ఆలయ పూజారి పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం ఎదుట శనివారం పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈవో డి.సోమయ్య, నాయకులు ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. హెచ్‌ఎంలు హన్మంతు, నారాయణ్‌సింగ్, అరుణ్, సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్, మండలాధ్యక్షుడు సాయికిరణ్, సభ్యులు ఉమేశ్, రమేశ్, అశోక్, మహేశ్వరి, కరుణ, అలేఖ్య, విజయ, సచిన్, క్రాంతి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మహాపూజకు ఆహ్వానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీవో, ఎమ్మెల్యే

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని జంగుబాయి ఆలయంలో ఈ నెల 25న నిర్వహించనున్న మహాపూజకు రావాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. శనివారం ఐటీడీఏలోని తన కార్యాలయంలో పీవో మహాపూజ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జంగుబాయి ఉత్సవ కమిటీ చైర్మన్ కొడాప జాకు, గౌరవాధ్యక్షుడు మరప బాజీరావు, సభ్యులు శ్యాంరావు, దౌలత్‌రావు ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

రెబ్బెన: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శనివారం తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జన జాగృతి కళాజాత బృందం కళాకారులు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కళాకారులు ఆటపాటల ద్వారా ఎయిడ్స్, హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకూడదని వివరించారు. కార్యక్రమంలో గణేశ్, శంకర్, డప్పు గౌతమ్, ప్రవళిక, ఎన్జీవో సూపర్‌వైజర్ లింక్ వర్కర్, టీం సభ్యులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలి



గోలేటిలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ వేణు



బొంబాయిగూడ పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

రెబ్బెన: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ వేణు సూచించారు. శనివారం మండలంలోని గోలేటి విలేజ్, గోలేటి టౌన్‌షిప్, పులికుంట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఓటరు ప్రక్రియ వివరాలను బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి ఉన్నారు.

పెంచికల్‌పేట్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని ఆయా పోలింగ్ బూతుల్లో ప్రత్యేక ఓటరు నమోదు డ్రైవ్‌లను శనివారం నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో బూత్ లెవల్ అధికారులు ఓటరు నమోదు, ఓటు మార్పిడి దరఖాస్తులు స్వీకరించారు. ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని తహసీల్దార్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. రెండు రోజులపాటు నిర్వహించే డ్రైవ్‌ను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని డొనల్ ప్రాంతంలో గల ప్రభుత్వ బాలికల ప్రాథమికోన్నత పాఠశాల పోలింగ్‌బూత్‌లో నిర్వహిస్తున్న ఓటరు నమోదు ప్రక్రియను శనివారం సిర్పూర్(టి) తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటుహక్కు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఎల్‌వోలతో మాట్లాడి ఓటరు నమోదుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్ఐ ముబినోద్దిన్, బీఎల్‌వోలు తదితరులు ఉన్నారు.

కెరమెరి: ఓటరు నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకూడదని, తప్పుఒప్పులను సవరించాలని తహసీల్దార్ షరీఫ్ అన్నారు. శనివారం మండలంలోని సుర్దాపూర్, ధనోరా, మోడి, కెరమెరి పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలతో మాట్లాడారు. ఆయన వెంట సిబ్బంది వివేక్, సిద్దార్థ, సేవంతా ఉన్నారు.

కౌటాల: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌ఐలు దేవేందర్, దిలీప్‌లు అన్నారు. మండలంలోని బోదంపల్లి, బాలేపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి సందేహాలున్న బీఎల్‌వోలు, తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆసిఫాబాద్‌అర్బన్: ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో 20మంది వరకు నూతన ఓటు నమోదు చేసుకున్నట్లు బీఎల్‌వోలు పేర్కొన్నారు. బీఎల్‌వోలు పంచదార లక్ష్మి, వనిత, సులోచన, సరోజ, ఎక్బాల్ భాను, లలిత, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గంగాపూర్‌లో డీఎల్పీవో విచారణ



విచారణ నిర్వహిస్తున్న డీఎల్పీవో సురేశ్‌బాబు

చింతలమానెపల్లి: మండలంలోని గంగాపూర్ గ్రామపంచాయతీలో జరిగిన అక్రమాలపై డీఎల్పీవో సురేశ్‌బాబు శనివారం విచారణ చేపట్టారు. గ్రామపంచాయతీలో చోటు చేసుకున్న అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్, వార్డు సభ్యుల తీర్మానం లేకుండా పంచాయతీ కార్యదర్శి సమ్మెలో ఉండగా సర్పంచ్ అవినీతికి పాల్పడి నిధులు వాడుకున్నారని వార్డు సభ్యులు, గ్రామస్తులు గతంలో ఆరోపించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ విలాస్, కార్యదర్శి ద్వారా డీఎల్పీవో వివరాలు సేకరించారు. రికార్డులు పరిశీలించారు. రూ.2లక్షల పైచిలుకు నిధులు దుర్వినియోగమైనట్లు నిర్ధారించారు. సర్పంచ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు రికవరీ చేయాలని కార్యదర్శి అశోక్‌ను ఆదేశించారు. చెల్లించకుంటే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని వివరించారు.

రక్తదానం చేసిన అటవీ అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అటవీ అధికారులు తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న వ్యక్తికి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకొన్నారు. వివరాల్లోకి వెళ్తే రేంజ్ పరిధిలో పని చేస్తున్న శిక్షణ అధికారి పరండే సాయిచరణ్, బీట్ అధికారి ఆకుల రాజేష్‌లు పట్టణానికి చెందిన జూల జ్యోతి అనే మహిళ రక్తహీనతతో బాధపడుతుందని సామాజిక మాధ్యమం ద్వారా తెలుసుకొని శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళకు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీట్ అధికారి మహేష్ పాల్గొన్నారు.